క్లుప్తంగా

పరిశుద్ధ ఆరోగ్యమాత ఆలయంలో ప్రార్థనలు



దోసపాడు ఆరోగ్యమాత ఆలయం వద్ద ప్రార్థనలు చేస్తున్న భక్తులు

దెందులూరు: ప్రతి ఒక్కరూ దేవుని ఆజ్ఞలను అనుసరిస్తూ ఆధ్యాత్మిక జీవనం సాగించాలని ఆర్‌సీఎం పోతునూరు పారిస్ క్రిస్ట్ ఫాదర్ పీ డేవిడ్ అన్నారు. మంగళవారం దోసపాడు ఆర్‌సీఎం చర్చిలో పరిశుద్ధ ఆరోగ్యమాత మహోత్సవాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఫాదర్ రాజు, ఫాదర్ ఇంజమాల్, ఉపదేశీయులతో కలిసి దివ్యబలి పూజ అర్పించారు. దెందులూరు, సత్యనారాయణపురం, గుండుగొలను, కేదవరం, ఉండ్రాజవరం, పోతునూరు, దోసపాడు, కొవ్వలి, పాలగూడెం నుంచి అధిక సంఖ్యలో భక్తులు మహోత్సవాల్లో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

సీసీ రోడ్డు నిర్మాణం



మొయ్యేరులో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ దుళ్ల కుటుంబరావు

గణపవరం: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల వినతి మేరకు గణపవరం మండలం మొయ్యేరు ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ దుళ్ల కుటుంబరావు మంగళవారం ప్రారంభించారు. ఇటీవల గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొన్నారు. మొయ్యేరు శివారు గ్రామం గంటసాలవారి పాలెంలో ఎస్సీ కాలనీ వాసులు తమకు రోడ్డు సదుపాయంలేక ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. గడపగడపకు కార్యక్రమంలో వచ్చిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం రూ.20 లక్షలను మంజూరు చేయడంతో ఆ ప్రాంతానికి సీసీ రోడ్డును నిర్మిస్తున్నట్లు సర్పంచ్ కుటుంబరావు తెలిపారు.

కైకరంలో నేత్ర వైద్య శిబిరం



కైకరంలో మానవత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వైద్యశిబిరం

ఉంగుటూరు: ఉంగుటూరు మండలం మానవత శాఖ ఆధ్వర్యంలో మీనాక్షి ప్రాథమిక కంటి హాస్పిటల్ గణపవరం వారు మంగళవారం ఉచిత నేత్ర శిబిరం నిర్వహించారు. కై కరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన శిబిరంలో సుమారు వందమంది కంటి పరీక్షలు నిర్వహించుకున్నట్లు మానవత రీజినల్ చైర్మన్ పుప్పాల గోపి తెలిపారు. 23 మందికి ఉచితంగా ఆపరేషన్ చేయిస్తామని, 42 మందికి అవసరమైన కంటి అద్దాలు అందిస్తామని తెలిపారు. మానవత మండల అధ్యక్షుడు గంజి రవి, సహాయ కార్యదర్శి కోనే వీర వెంకట సత్యనారాయణ, గ్రామ వైస్ సర్పంచ్ మట్ట మురళి, చిన్నం అనిల్, ఎంపీటీసీ–3 వెంకన్న బాబు, వార్డ్ మెంబర్ నత్త వెంకటేశ్వరరావు, దేవదీనం, కొరిపల్లి శ్రీను, గంజి ప్రభాకర్, డాక్టర్ కె.హరినాథ్ రెడ్డి పాల్గొన్నారు.

మాగంటి బాబును కలిసిన ముద్రగడ పద్మనాభం

దెందులూరు: మాజీ ఎంపీ మాగంటి వెంకటేశ్వరరావు (బాబు)ను మంగళవారం ఏలూరులోని ఆయన నివాసంలో కాపు నేత, మాజీ ఎంపీ ముద్రగడ పద్మనాభం కలిశారు. ఈ సందర్భంగా మాగంటి బాబు మాట్లాడుతూ తమ కుటుంబంతో ఉన్న అనుబంధం కారణంగా ముద్రగడ పద్మనాభం మర్యాదపూర్వకంగా కలిశారన్నారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం



భీమడోలులో ఆసరా సంబరాల్లో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, చిత్రంలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు



భీమడోలులో జగనన్న చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న డ్వాక్రా మహిళలు, ప్రతినిధులు

- జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ
- సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు సమాన ప్రాధాన్యత
- పథకాలతో పేద కుటుంబాల్లో వెలుగు
- ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

భీమడోలు: మహిళా సాధికారతే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తూ పారదర్శక పాలన అందిస్తున్నారని ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. భీమడోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో నాల్గవ విడత ఆసరా సంబరాల్లో డ్వాక్రా అక్క చెల్లెమ్మలకు మంగ ళవారం డ్వాక్రా రుణమాఫీ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ పాము సునీత అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగనన్న పాటకు మహిళలు, బాలికలు నృత్యాలు చేసి ఆహుతులను ఆకట్టుకున్నారు. మహిళలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ గాంధీజీ, అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్నారన్నారు. దేశ చరిత్రలోనే కుల, మతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పథకాలను అందిస్తూ వారి కుటుంబాలకు భరోసా కల్పిస్తున్న ఏకైక సీఎం జగనన్న అన్నారు. ఎమ్మెల్యే పుప్పాల వాసు బాబు మాట్లాడుతూ పేదల జీవితాలు బాగుండాలన్నదే సీఎం జగనన్న లక్ష్యమన్నారు. వచ్చే ఎన్నికలు పెత్తందార్లు, పేదలకు మధ్య జరిగే యుద్ధమని, తాము ఎన్నడూ పేదల వైపే ఉంటూ మంచికి నిలబడతామన్నారు. ఈ యుద్ధంలో జగనన్నను గెలిపించేందుకు మనమంతా సిద్ధం కావాలని కోరారు. సంక్షేమ పాలన ద్వారా దేశంలో ఏపీ అన్ని రంగాల్లో ముందంజలో ఉందన్నారు. జగనన్న పాలనలో 124 సార్లు బటన్ నొక్కి రాష్ట్రంలో రూ.2.65లక్షల కోట్ల నగదును వివక్ష లేకుండా పారదర్శకంగా నేరుగా డీబీటీ ద్వారా పేద లబ్ధిదారులకు నేరుగా వారి ఖాతాల్లో జమ చేశారన్నారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తెచ్చి సర్కారీ బడుల్లో చదివే ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను ప్రభుత్వం అందిస్తోందన్నారు. పేద విద్యార్థుల భవిష్యత్తు కోసం ఆలోచించే మహోన్నత వ్యక్తి సీఎం జగనన్న అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో రెండు బటన్లు వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు వేసి గెలిపించాలన్నారు. జిల్లా బీసీ సెల్ కన్వీనర్ ఘంటా ప్రసాదరావు మాట్లాడుతూ గతంలో చంద్రబాబు 640 ఎన్నికల హామీలిచ్చి గెలిచిన తర్వాత బుట్టదాఖలు చేసిన ఘనుడన్నారు. ఆయన ఎన్ని హామీలిచ్చినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. భీమడోలు, పోలసానిపల్లి, అంబర్‌పేట, సూరప్పగూడంలోని డ్వాక్రా చెల్లెమ్మలకు రూ.20కోట్ల విలువ గల రుణమాఫీ చెక్కును పద్మశ్రీ, వాసుబాబు చేతుల మీదుగా అందించారు. మహిళలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కనమాల రామయ్య, జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ, జిల్లా బీసీ సెల్ కన్వీనర్ ఘంటా ప్రసాద రావు, మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ ఇంజేటి నీలిమ, సర్పంచ్ వెజ్జు బాలాజీ, ఉపసర్పంచ్ ఇనపాల సాయి, జిల్లా కార్యవర్గ సభ్యుడు తుమ్మగుంట రంగ, మండల సాగు సలహా మండలి చైర్మన్ పసుపులేటి సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్, ఎంపీటీసీలు అంబటి దేవీ ప్రసాద్, గంటా శ్రీనివాసరావు, ఆజామ్, మండల ప్రధాన కార్యదర్శి రామ కుర్తి నాగేశ్వరరావు, ఆసుపత్రి అభివృద్ధి కమిటి చైర్మన్ చింతా శ్రీరామ చంద్రమూర్తి, జిల్లా చైతన్య యువజన సంఘం అధ్యక్షుడు పాము మాన్‌సింగ్, మండల యూత్ అధ్యక్షుడు మద్దుల రాజా, నాయకులు ఏపూరి రాంబాబు, రామిశెట్టి శ్రీను, ఏపీఎం సురేష్,అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

రికార్డుల నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు

భీమడోలు: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకం చేపట్టి అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద పథకపు రికార్డుల నిర్వహణలో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని భీమడోలు ఎంఈవో– 2 అయినపర్తి భాస్కర్‌కుమార్ అన్నారు. పోలసానిపల్లి –1, 2 ప్రాథమిక పాఠశాలలను మంగళవారం ఆయన సందర్శించారు. విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాల స్థాయి పరిశీలన, ఎండీఎం రికార్డులు నిర్వహణ, నాడు–నేడు పథకపు పనులు, ఈనెల 9న నిర్వహించనున్న డీవార్మింగ్ మాత్రల పంపిణీకి ఏర్పాట్లు తదితర అంశాలను ఆయన పరిశీలించారు. ఎండీఎం రికార్డులను ఆయన పరిశీలించారు. హెచ్‌ఎంలు పి.రామ్మోహనరావు, కె.తులసికి తగు సూచనలందించారు. పాఠశాలలకు హాజరయ్యే విద్యార్థులంతా మధ్యాహ్న భోజనం భుజించేలా శ్రద్ధ వహించాలన్నారు. వారికి మెనూ ప్రకారం పరిశుభ్రమైన రుచికరంగా భోజనం అందించాలన్నారు. ఎండీఎంలోని రికార్డులను సక్రమంగా నిర్వహించాలని లేని పక్షంలో అందులకు బాధ్యులైన వారికి షోకాజ్ నోటీ సులు జారీ చేస్తామన్నారు. విద్యార్థుల్లో విద్యాసామర్థ్యాలను మెరుగుపర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీ రాజు, టీచర్ కాటాక్షం పాల్గొన్నారు.

నేడు దెందులూరు మండల సర్వసభ్య సమావేశం

దెందులూరు: దెందులూరు మండల సర్వసభ్య సమావేశం బుధవారం ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్నట్టు దెందులూరు ఎంపీడీఓ పీ.శ్రీలత అన్నారు. మండలంలో ఎంపీటీసీలు, అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని ఎంపీడీఓ కోరారు.

జాతీయస్థాయి పోటీలకు స్పోర్ట్స్ కళాశాల క్రీడాకారులు



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన స్పోర్ట్స్ కళాశాల క్రీడాకారులు

భీమడోలు: పోలసానిపల్లి బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల స్పోర్ట్స్ కళాశాలలోని ముగ్గురు క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కళాశాలలోని కె.కావ్య, వై.యశస్విని, జే.పల్లవీ చక్కని ప్రతిభను చాటారు. కృష్ణా జిల్లా ఉయ్యూరులో గత నెల 30న నిర్వహించిన 19వ రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల జూనియర్ అథ్లెటిక్స్ మీట్ పోటీలు నిర్వహించారు. కళాశాలలోని అండర్ 14 విభాగంలో కె.కావ్య 60 మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్, హైజంప్‌లో అదే విధంగా వై.యశస్విని 60 మీటర్ల పరుగు, లాంగ్ జంప్, హైజంప్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభను చూపారు. అండర్ 16 విభాగంలో జే.పల్లవి 600 మీటర్ల పరుగులో సత్తా చాటింది. వివిధ విభాగాల్లో క్రీడా ప్రతిభను చాటిన ముగ్గురిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసారని ప్రిన్సిపల్ రమణ, కోచ్ జి.కృష్ణకుమారి మంగళవారం రాత్రి తెలిపారు. ఈనెల 16 నుంచి 18వ తేదీ వరకు గుజరాత్ నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని కోచ్ కృష్ణకుమారి తెలిపారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

పెదవేగి : తన కుమార్తె కొద్ది రోజుల నుంచి కనిపించడం లేదని ఓ తల్లి పోలీసులను ఆశ్రయించింది. పెదవేగి ఎస్సై వీ రాంజేంద్రప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం వంగూరు గ్రామానికి చెందిన రామతులసికి నిడమర్రు మండలం పెదనిండకొలనుకు చెందిన గండం శివశ్రీనుకి 10 ఏళ్ల క్రితం వివాహమైంది. భర్తతో కలిసి ఆమె ఉపాధి కోసం నెల్లూరు వెళ్లి జనవరి 10న పెదవేగి మండలం వంగూరులోని పుట్టింటికి వచ్చింది. ఆ మరుసటి రోజు జనవరి 11న ఉదయం నుంచి గండం రామతులసి కనిపించకపోవడంతో చుట్టుపక్కల పరిసర ప్రాంతాల్లో, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ప్రయోజనం లేకపోవడంతో ఆమె తల్లి మోటూరి పద్మవతి పెదవేగి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేంద్రప్రసాద్ చెప్పారు.

జాతీయ సంస్థ శిక్షణకు ఎంపికైన గోకవరం సర్పంచి

ఉంగుటూరు: జాతీయ రూరల్ డవలప్‌మెంట్ అండ్ పంచాయతీ రాజ్ సంస్థ ఇచ్చే శిక్షణ ఎ.గోకవరం సర్పంచి మిద్దే సత్యవతి ఎంపికై హైదరాబాదులో శిక్షణ పొందుతున్నారు. ఈ సంస్థకు చెందిన శిక్షణ కార్యక్రమానికి ఏలూరు జిల్లా నుంచి ఇద్దరిని ఎంపిక చేశారు. అందులో ఎ.గోకవరం సర్పంచి మిద్దే సత్యవతి ఒకరు. సోమవారం నుంచి ఈమె 5రోజులు శిక్షణ పొందనున్నారు. గ్రామాల్లో మంచి నీరు, పారిశుద్ధ్యం, డ్రెయినేజీ, రహదార్ల నిర్వహణ, ఇలా పలు అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. శిక్షణకు వెళ్లిన సత్యవతిని తోటి సర్పంచులు గ్రామస్తులు, వైఎస్సార్ సీపీ నాయకులు అభినందిస్తున్నారు.

22, 23 తేదీల్లో క్రీడాకారుల ఎంపిక పోటీలు

ఏలూరు రూరల్: ఈ నెల 22, 23 తేదీల్లో ఏలూరు సాయ్ సెంటర్ 2024–25 ఏడాది ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్టు సెంటర్ ఇన్‌చార్జి డీఎస్‌వీ వినాయక్ ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. అథ్లెటిక్స్ విభాగంలో బాలబాలికలు, వెయిట్ లిఫ్టింగ్‌లో బాలికలు మాత్రమే పాల్గొనాలని పేర్కొన్నారు. 12 ఏళ్లు నుంచి 18 ఏళ్ల మధ్య వయస్సు గల వారు ఎంపిక పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు వయస్సు ధ్రువీకరణ పత్రం (10వ తరగతి మార్క్ లిస్ట్, తహసీల్దార్ జారీ చేసిన భర్త్ సర్టిఫికెట్), మూడు పాస్ట్‌పోర్టు సైజు ఫొటోలు, ఒరిజినల్ ఆధార్ కార్డుతో 22వ తేదీ ఉదయం 7 గంటలకు సాయ్ సెంటర్ ఇన్‌చార్జికు రిపోర్ట్ చేయాలని సూచించారు.

పౌష్టికాహారం పంపిణీ

ఏలూరు రూరల్: ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియం మహిళ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు క్రీడాకారులకు మంగళవారం పౌష్టికాహారం పంపిణీ చేపట్టారు. స్థానిక స్పోర్ట్స్ హాస్టల్‌లో శిక్షణ పొందుతున్న బాలబాలికలకు పలు రకాలు పిండి వంటకాలను అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షురాలు కర్రి అరుణ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో పిల్లలు జంక్ ఫుడ్ తీసుకుంటున్నారని తెలిపారు. పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే జంక్‌ఫుడ్ వదిలి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి మేరీ మాణిక్యం, ట్రెజరరీ రామ్ సత్యవతి, పద్మావతి, శ్రీలక్ష్మి, అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇంటికే వైద్య సేవలు

ఏలూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేదల ఆరోగ్యమే ధ్యేయంగా పనిచేస్తోందని కోటేశ్వరదుర్గాపురం సర్పంచ్ వర్రి లక్ష్మీదుర్గ కొనియాడారు. మంగళవారం కోటేశ్వరదుర్గాపురంలో అధికారులు ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నేత వర్రి నారాయణ కొనియాడారు. గుడివాకలంక, చాటపర్రు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది వైద్య సేవలందించారు.ఎంపీడీఓ బి.ప్రణవి తదితరులు పాల్గొన్నారు.

వైకల్యం నివారణపై అవగాహన సదస్సు



దెందులూరు సచివాలయంలో వైకల్యం- నివారణపై మాట్లాడుతున్న డాక్టర్ రాకేష్

దెందులూరు: వైకల్యం అనేది గర్భస్థ సమయంలో, ప్రసవం సమయంలో లేదా మేనరిక వివాహాలు చేసుకోవడం వల్ల కూడా సంభవిస్తుందని డాక్టర్ బీ.రాకేష్ అన్నారు. మంగళవారం దెందులూరు సచివాలయంలో ఉమా ఎడ్యుకేషన్ టెక్నికల్ సొసైటీ దొండపాడు ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ రాకేష్ మాట్లాడుతూ తగు జాగ్రత్తలు తీసుకోవడంతో వైకల్యాన్ని అధిగమించవచ్చని అన్నారు. సంస్థ కోఆర్డినేటర్ డీ.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం ద్వారా దివ్యాంగులకు అవసరమైన ఫిజియోథెరిపీ, స్పీచ్‌థెరిపీ, ఆడియోలజీ, కృత్రిమ అవయవాలు తదితర సేవలు అందిస్తున్నామన్నారు. దివ్యాంగులు ఈ సేవలను ఉపయోగించుకోవాలని కోరారు. గ్రామ కార్యదర్శి వీఎస్ చౌదరి మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమం కోసం ఉమా ఎడ్యుకేషన్ టెక్నికల్ సొసైటీ చేస్తున్న సేవలను అభినందించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, జిల్లా దివ్యాంగుల పునరావాస సిబ్బంది, ఏఎస్‌ఎంలు ఉన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య నిపుణులు

భీమడోలు: చెట్టున్నపాడులోని సచివాలయం వద్ద మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమానికి రోగుల అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ జల్లూరి వెంకట నరసమ్మ అభిమాన్యు ప్రారంభించారు. ఈవోఆర్‌డీ ఏ.సుందరి, సర్పంచ్ జల్లూరి వెంకట నరసమ్మలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యవంతులు ఉండాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తోందన్నారు. భీమడోలు సీహెచ్‌సీ సూపరిండెంటెంట్ ఎస్.సునీత, వైద్యులు డాక్టర్ కె.శ్రీలక్ష్మీ, జాహ్నవి జనరల్ రోగులకు పరీక్షలు చేసారు. 460 మంది హాజరు కాగా వారికి వైద్య పరీక్షలు చేశారు. వైఎస్సార్ కంటి వెలుగులో వృద్ధులు 60 మందికి కంటి పరీక్షలు చేసారు. ఉచితంగా మందులను అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామకార్యదర్శి వెంకట్రావు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

నులి పురుగుతో అనారోగ్యం



గణపవరం పీహెచ్‌సీలో నులి పురుగు నివారణపై సూచనలిస్తున్న వైద్యాధికారి

గణపవరం: నులి పురుగులతో రక్తహీనత సమస్య ఏర్పడుతుందని, అనేక రకాల ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారి పులపర్తి సంతోష్ అన్నారు. మంగళవారం గణపవరం పీహెచ్‌సీలో ఈనెల 9న నిర్వహించనున్న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బందికి, ఆశ వర్కర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నులి పురుగుల వల్ల కలిగే నష్టాలను ప్రతి ఇంటికీ వెళ్లి వివరించాలని, అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదివే పిల్లలందరికీ తప్పని సరిగా ఆల్‌బెండజోల్ మాత్రలు వేయాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా నులిపురుగుల నివారణ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌లను విడుదల చేశారు. ఆశనోడల్ అధికారిణి పద్మజ, సీహెచ్‌వో జాలాది విల్సన్ మాట్లాడుతూ యూనివర్సల్ ఇమ్యునైజేషన్ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో ప్రతి బుధ, గురువారాలలో వ్యాధినిరోధక టీకాల కార్యక్రమం ఉంటుందని, తమ పిల్లలకు తప్పకుండా టీకాలు వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది. మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు, ఏఎస్ఎంలు, ఆశ సిబ్బంది పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో ఇస్రో అంతరిక్ష ప్రయోగాలు



కైకరం హైస్కూల్లో విద్యార్థులకు అంతరిక్ష ప్రయోగాలను వివరిస్తున్న శాస్త్రవేత్త శివప్రసాదు

ఉంగుటూరు: చంద్రయాన్–3 విజయాలను రిటైర్డు శాస్త్రవేత్త శివప్రసాద్ వెల్లడించారు. మంగళవారం కైకరం హైస్కూల్లో హెచ్‌ఎం ప్రసాదరావు అధ్యక్షతన అంతరిక్ష ప్రయోగాలపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న శివప్రసాదు మాట్లాడుతూ విజయం సాధించిన చంద్రయాన్–3, ఆదిత్య ఎల్ మరెన్నో ఇస్రో విజయాలను తెలియజేశారు. తక్కువ ఖర్చుతో అంతరిక్ష ప్రయోగాలు చేస్తున్న మన దేశ శాస్త్రవేత్తల పరిశోధనలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని సూచించారు. శాటిలైట్ లాంచింగ్, ఎస్ఎల్‌వీ, పీఎస్ఎల్‌వీ, జీఎస్ఎల్వి, తదితర రాకెట్ల మోడళ్లను వాటి పనితీరు విద్యార్థులకు ఆకట్టుకునేలా వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సీహెచ్ శ్రీనివాస్, కె. జాన్, పిస్తేనమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

డీలర్ల సమస్యల పరిష్కారానికి కృషి



నూతన తహసీల్దార్ వీ జితేంద్రను సత్కరిస్తున్న మండల రేషన్ డీలర్లు



తహసీల్దారు సూర్యప్రభను అభినందిస్తున్న రెవెన్యూ సిబ్బంది

దెందులూరు: డీలర్ల సమస్య పరిష్కారానికి కృషి చేయాలని రేషన్ డీలర్ల సంఘం ఉపాధ్యక్షుడు తలారి రామకృష్ణ అన్నారు. మంగళవారం దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వీ.జితేంద్రను డీలర్లు సత్కరించారు. అనంతరం డీలర్ల సమస్యలు వివరించారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ డిప్యూటీ తహశీల్దార్ కృష్ణస్వామి, డీలర్లు వీ.ఆరోగ్యం, మురళీ, నాగు, శివ, లక్ష్మీనారాయణ ఉన్నారు.

గణపవరం తహసీల్దార్‌గా రాంబాబు



గణపవరం తహసీల్దార్ రాంబాబు

గణపవరం: ఎన్నికల బదిలీల్లో భాగంగా గణపవరం నూతన తహసీల్దార్‌గా కె.రాంబాబు బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ముమ్మిడివరం తహసీల్దార్‌గా పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేస్తున్న పమ్మిలక్ష్మి మచిలీపట్నం తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. పమ్మి లక్ష్మికి వీడ్కోలు, రాంబాబుకు స్వాగత కార్యక్రమాన్ని రెవెన్యూ సిబ్బంది, వీఆర్వోల ఆధ్వర్యంలో నిర్వహించారు.

పెదవేగి తహసీల్దార్‌గా సూర్యప్రభ బాధ్యతల స్వీకరణ

పెదవేగి : పెదవేగి తహసీల్దారుగా ఎం.సూర్యప్రభ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ కలెక్టరేట్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న సూర్యప్రభ ఎన్నికల బదిలీల్లో భాగంగా పెదవేగి వచ్చారు. ఇప్పటివరకు పెదవేగి తహసీల్దార్‌గా పనిచేసిన ఎన్.నాగరాజు మన్యం జిల్లాకు బదిలీ అయ్యారు. తహసీల్దార్ బాధ్యతలు స్వీకరించిన సూర్యప్రభకు డిప్యూటీ తహసీల్దార్ భ్రమరాంబ, ఆర్ఐ రామకృష్ణ, సర్వేయర్ సత్యనారాయణ మూర్తి, కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు, వీఆర్ఏలు పుష్పగుచ్ఛం అందించి అభినందించారు.

చేయాలనే తపనే విజేతల ప్రథమ లక్ష్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏ లక్ష్యాన్ని అయినా సాధించే విజేతల ప్రథమ లక్ష్యం చేయాలనే తపనే అని రోటరీక్లబ్ మాజీ జిల్లా గవర్నర్ ఎంసీ దాస్ అన్నారు. స్థానిక సీఆర్ఆర్ మహిళా కళాశాల సైకాలజీ కౌన్సిలింగ్ సెల్, రోటరీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం మోటివేషన్ కీ ఫర్ సక్సెస్ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా దాస్ మాట్లాడుతూ పూజించబడేవాటినే పూజించాలని, మంచివారిని మంచి అనాలని, చెడ్డవారిని ఏమీ అనవద్దని సూచించారు. మంచి విషయాలకు మాత్రమే సెల్‌ఫోన్ వాడాలని, ఆరోగ్యకరమైన అలవాట్లు చేసుకోవాలని, కుటుంబంతో సత్సంబంధాలు కలిగి ఉండాలని అన్నారు. ఆలోచనల్లో సానుకూల దృక్పథం ఉండాలని, జీవితంలో కష్టాలు రోజూ ఉండవని, మంచిరోజు కోసం ఎదురుచూడాలని, నిజాయితీగా ఉంటూ చెప్పింది చేయాలని, చేసేదే చెప్పాలని సూచించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు నేలపాటి రోహిత్, గుడిపాటి లలిత, కళాశాల ప్రిన్సిపాల్ పి.శైలజ, ఉపాధ్యాయులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



విద్యార్థులకు ట్యాబ్‌లు అందిస్తున్న దిరిశాల ప్రసాద్, రాము

ఏలూరు రూరల్ : ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు టాబ్స్ వల్ల భవిష్యత్తులో టెక్నాలజీ రంగంలో రాణిస్తారని రాష్ట్ర మెడికల బోర్డు డైరెక్టర్ దిరిశాల ప్రసాద్ అన్నారు. మంగళవారం దక్షిణపువీధి ప్రభుత్వ పాఠశాలలో బాలబాలికలకు ఆయన ట్యాబ్స్ పంపిణీ చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రూ.వేలు ఖరీదైన ట్యాబ్స్ ఉచితంగా అందిస్తున్నారని కొనియాడారు. ఉన్నత వర్గాల పిల్లలతో సమానంగా పేద విద్యార్థులు పోటీ పడాలంటే కంప్యూటర్‌పై అవగాహన పెంచుకోవాలని సూచించారు. వైఎస్సార్ సీపీ హయాంలో ప్రభు త్వ పాఠశాలలు బలోపేతమయ్యాయని కార్పొరేటర్ తంగెళ్ల రాము అన్నారు. నాడు నేడు నిధులతో పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించిన జగన్ సేవలు మరువరాదన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.